

# ఆచార్య దేవోభవ

ఎమ్. ఉమాలక్ష్మి

ఆకాశం నుండి నక్షత్రాలు క్రిందికి దిగాయా అన్నట్లు, ఆ కాలేజీ ఆవరణ అంతా రంగురంగుల విద్యుద్దీపాల కాంతులతో ధగధగా మెరిసిపోతూంది.

ఆ రోజు ఆ కాలేజీ వార్షికోత్సవం. అది సంగీత కళాశాల అవడంవల్ల, ఆ రోజు గోపాలరావుగారి కచేరీ ఏర్పాటు చేశారు.

ఆ కాలేజీ ఆవరణ అంతా జన సమూహంతో కిటకిటలాడిపోతూ హడావుడిగా వుంది. ఇంత మంది జనం ఉన్నా, ఒకళ్ళుకూడా పెదవి విప్పి మాట్లాడడం లేదు. అందరూ పరవశించిపోతూ, తలలు ఊపుతూ, కొందరు చేతులతో తాళాలు వేస్తూ తన్మయంగా కచేరీ వింటున్నారు.

అతని గానం వీనుల విందుగా వుంది, ఆ గానానికి పరవశించినట్లు, చెట్లు చిరుగాలికి చిన్నగా తలలు ఊపుతున్నాయి.

అతడు సంగీతంలో నిష్ణాతుడు. అతడికి గాన దురంధర గాయక సార్వభౌమ అన్న బిరుదులు కూడా ఉన్నాయి.

మూడు గంటల సేపు నిర్విరామంగా పాడి, కచేరీ ముగించాడు గోపాలరావు.

అందరూ అతడిని అభినందనలతో ముంచెత్తుతున్నారు. కొందరు ఆ మహా విద్వాంసుడి కాళ్ళకు దణ్ణాలు పెడుతున్నారు. కొందరు అతడి చేత ఆటో

గ్రాఫ్‌లు చేయించుకుంటున్నారు,

జనం క్రమక్రమంగా పల్చబడ్డారు.

ఇంక గోపాలరావు స్టేజిమీద నుండి లేచి, ప్రక్క గదిలోకి వెళ్ళబోయాడు.

ఇంతలో అతడి కాళ్ళను చుట్టేసాడొక పదేళ్ళ కుర్రాడు.

విస్మయంగా ఆ కుర్రాడివి లేవనెత్తి "బాబూ, నువ్వెవరివి? నీకేం కావాలి?" అన్నాడు గోపాలరావు.

"మీరు మహా విద్వాంసులు. మిమ్మల్ని చూడడం నిజంగా నా అదృష్టం. నాకు సంగీత మంటే చాలా ఇష్టం. నాకు తల్లి, తండ్రి ఎవరూ లేరు. నేనొక అనాథ బిడ్డను. మీరు దయతలచి నాకు సంగీతం నేర్పిస్తే, ఈ జీవితాంతం మీ సేవ చేసుకుంటూఉంటాను" అన్నాడు ఆ పిల్లాడు చేతులు జోడిస్తూ!

"అలాగే బాబూ: నీకు తప్పకుండా సంగీతం నేర్పుతాను. ఈ రోజు నుండి నువ్వు మా ఇంట్లోనే ఉందువుగాని" అని ఆ కుర్రాడి శిరస్సుమీద చేతితో నిమిరాడు గోపాలరావు.

అక్కడున్నవారంతా ఆశ్చర్యంతో తల మునకలయ్యారు.

ఆ కుర్రాడు అలా ప్రవర్తించినందుకు, అతడు విసుక్కుంటాడని, ఆ పిల్లాడిని విదిలించుకొని దూరంగా వెళ్ళిపోతాడని ఊహించుకున్న ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఆశ్చర్యంగా చూశాడతడివైపు.

తనకోసం వచ్చిన ఆటోలో, ఆ కుర్రాడిని కూడా కూర్చోబెట్టుకొని, ఇంటి ముఖం పట్టాడు గోపాలరావు.

* * *

చిన్న సైజు బంగళాలాగ ఉన్న ఆ ఇంట్లో అడుగుపెడుతూనే ఆశ్చర్యపోయాడు సతీష్! ఈ రోజునుండి తను ఇంత పెద్ద ఇంట్లో ఉంటాడు. ఇంత గొప్ప విద్వాంసుడి ఆదరణ లభించిందే ఇక తను కోరుకున్న ఆ సంగీత విద్య తన వశం అవుతుంది అని ఆలోచిస్తూ ఇల్లంతా కలియతిరుగుతున్నాడు.

ఆ గది గోడలకు త్యాగరాజు, ముత్తుస్వామి, శ్యామ శాస్త్రుల నిలువెత్తు తైల వర్ణచిత్రాలు అతి మనోహరంగా అలంకరించబడి వున్నాయి. వాటిని చూస్తూ ఒక్క క్షణం బాహ్య ప్రపంచాన్ని మరచిపోయాడు.

"బాబూ: నీ పేరేంటన్నావ్?" అంటూ వచ్చాడు గోపాలరావు.

"సతీషండి." అన్నాడు ఆ ఫొటోల నుండి దృష్టి మరల్చకుండానే.

"చూడు సతీష్! ఈ రోజు రాత్రికి నా కచేరీ వుంది. ఆ తంబూరా శ్రుతి చెయ్యాలి. దాన్ని శుభ్రంగా తుడిచి ఇలా తీసుకురా" అన్నాడు ఆజ్ఞాపిస్తూ:

చెప్పిందే తడవుగా తంబూరాని తుడిచి, అతడి ముందుపెట్టాడు.

గోపాలరావు తంబూరా శ్రుతిచేసి సాధన మొదలుపెట్టాడు.

ఆ గానాన్ని తన్మయంగా వింటున్న సతీష్‌కి లోపలినుండి. 'సతీష్' అన్న కేక వినబడడంతో చివాల్న లేచాడు.

"అమ్మగారూ పిల్చారా?" అన్నాడు వినయంగా.

"పిలవడంగాదురా, అరిచాను. ఈ రోజు పనిమనిషి రాలేదు. ఆ గిన్నెలన్నీ అలాగే పడున్నాయి. కాస్త ఆ సామాన్లు తోమి ఇంట్లో పెట్టు." అంది చికాకుగా అన్నపూర్ణ.

"సరేనమ్మా." అని ఆ పనిలో నిమగ్నమయ్యాడు.

"ఒరేయ్ సతీష్! నాకు స్కూల్‌కి టైం అవుతుంది. ఈ బట్టలు అర్జంటుగా ఇస్త్రీ చేసిపెట్టు" పిల్చాడు గోపాలరావు కొడుకు మనోహర్!

వచ్చిన మొదటి రోజునే అందరూ తలా ఒక పని అప్పజెప్పినా, విసుక్కోకుండా అందరి పనులు సవ్యంగా నెరవేర్చాడు.

* * *

సతీష్ ఆ యింట్లోకి వచ్చి ఆరు నెలలు అయ్యింది.

ఇంతవరకు సతీష్‌కి సంగీతం నేర్పలేదు గోపాలరావు. ఆ యింట్లో పని మాత్రం బాగా నేర్చుకున్నాడు. ఏ సమయానికి, ఎవరికి ఏమి అందివ్వాలో, ఎప్పుడే పని చెయ్యాలో క్షుణ్ణంగా తెలుసుకున్నాడు.

ముందు గదిలో గోపాలరావు సంగీత పాఠాలు చెప్తుంటే, చెవులప్పగించి వినేవాడు. ఇంతలో ఎవరో ఒకరు పిలిచి, ఏదో ఒక పని చెప్పడంతో, అక్కడ నుండి వెళ్ళలేక, వెళ్ళలేక వెళ్ళేవాడు.

ఎలాగైనా ఆ రోజు సంగీతం చెప్పమని అడగాలని నిర్ణయించుకొని, గోపాలరావు ఎదుట చేతులు కట్టుకొని నిలబడ్డాడు

"ఏరా సతీష్, ఎందుకలా నిల్చున్నావు?" అడిగాడు గోపాలరావు.


"మరి, మరండీ నాకు... నాకు... సంగీతం నేర్పరూ!" దీనంగా అడిగాడు సతీష్!

"సరే, చెప్తాను. ఇలా వచ్చి మఠం వేసుకొని కూర్చో."

సతీష్ చేత స,ప,సలు పట్టించాడు. కానీ సతీష్ ఆ స్వరాలను పలకలేక పోయాడు.

"నువ్వు సంగీతం నేర్చుకుంటానన్నావు. స,ప,స అనే ఈ మూడు అక్షరాలే పలకలేనివాడివి సంగీతం ఎలా నేర్చుకుంటావు? ఈ రోజు నేను చెప్పిన పాఠం మనసులో ఉంచుకొని బాగా సాధన చెయ్యి" అంటూ లేచాడు గోపాలరావు

మరొకసారి చెప్పమని అడగడానికి ధైర్యం చాలలేదు సతీష్‌కి. అంతులేని నిరుత్సాహం ఆవహించింది క్షణంలో.




ఆ రోజు రాత్రి సతీష్, స,ప,స లే మననం చేసుకుంటూ బిగ్గరగా పాడ సాగాడు.

ఇంతలో గోపాలరావుగారి అమ్మాయి నళిని విసురుగా సతీష్ దగ్గరకి వచ్చింది.

"ఓయ్, సత్తీ: ఎందుకలా అరుస్తున్నావు? నీకు సంగీతం రాదుగాని, నీ గోలకి నా చదువు పాడవుతుంది. కాసేపు నోరుమూసుకొని ఉండు" అని ఆజ్ఞాపించింది నళిని.

దాంతో సతీష్ నోరు మూతపడి పోయింది.

* * *

ఆ ఇంట్లో సతీష్ జీతం బత్తెంలేని నౌకరు. బజారు పని, ఇంటి పని అన్ని పనులూ విసుక్కోకుండా చేస్తాడు. సతీష్ ఇంట్లో అడుగుపెట్టిన దగ్గర నుండి అందరి పనులు తేలిక అయ్యాయి.

ఆ ఇంట్లో అందరూ సతీష్ని, సత్తీగాడా అని పిలుస్తారు.

అలా పిలిచినా అభిమాన పడలేదు. తనని చేరదీసి, తనకింత అన్నంపెట్టిన గోపాలరావు దంపతులే, తల్లిదండ్రులుగా భావించేవాడు.

గోపాలరావుకి మూడ్ బాగున్నప్పుడు సతీష్కి నాలుగు స్వరాలు చెప్పేవాడు. సతీష్ ఏమాత్రం తప్పు పాడినా, తల వాచేటట్లు చివాట్లు పెట్టేవాడు. ఒక్కోసారి కోపంతో, చెయ్యి కూడా చేసుకునే వాడు.

సతీష్కి వారానికి ఒక్కరోజే పాఠం చెప్పేవాడు. మిగతా రోజుల్లో సతీష్ సంగీతసాధన చేసుకునేవాడు.

ఇంట్లో సాధన చేస్తే నళినికి, మనో

హర్‌కి డిస్టర్బెన్స్ అని, పెరట్లో జామ చెట్టు క్రింద కూర్చొని సాధన చేసుకునేవాడు.

*  *  *

కాల గమనంలో పదేళ్ళు గడిచి పోయాయి. ఈ పదేళ్ళ కాలంలో, గోపాలరావు వార్ధక్యానికి దగ్గర అవడంతో అంతగా పాడలేకపోయేవాడు. సంగీతం లెక్చరర్‌గా పనిచేసే గోపాలరావు రిటైరు అవడంతో, ఆదాయం తగ్గింది. ఇంటి ఖర్చులు పెరిగాయి. నళిని పెళ్ళి ఆర్భాటంగా చెయ్యడంతో, గోపాలరావుకి కొంత అప్పు కూడా అయ్యింది.

మనోహర్ చదువు పూర్తి అయ్యింది గాని, అతడికి ఉద్యోగం ఏదీ రాక పోవడంతో, డబ్బుకి కొంచెం ఇబ్బంది ఏర్పడిందనే చెప్పాలి.

ఈ పరిస్థితిలో సతీష్‌ని పోషించడం గోపాలరావుకి కొంచెంకష్టంగానేఉండేది. సతీష్ అంటే పదేళ్ళుగా ఏర్పడిన అనుబంధం వల్లో, అంతకన్నా నమ్మకమైన నౌకరు దొరకడన్న భయంవల్లో, సతీష్‌ని ఆ యింటి నుండి పంపివెయ్యలేదు.

సతీష్‌కి ఈ పదేళ్ళలోనూ సంగీతంలో మెళుకువలు కొద్దికొద్దిగా తెలిసాయి. సతీష్ పాట వింటుంటే, ఒక్కోసారి గోపాలరావే అబ్బురపడేవాడు. సతీష్ ఒక రత్నంలాంటి వాడని, సానబెడితే బాగా వృద్ధిలోకి వస్తాడని అతడూహించినా, సతీష్‌కి ఎప్పుడూ మనస్ఫూర్తిగా సంగీతం చెప్పేవాడు కాదు.

తన విద్య తన పిల్లలకే రాలేదు. ఒక అనామకుడికి తన విద్యాదానం చేసి, వాడు సంగీతంలో తనని మించిపోవడం అతడి కెంతమాత్రం ఇష్టం లేదు. అందుకే సతీష్‌కి సంగీత విద్య పూర్తిగా చెప్పలేదు.

*  *  *

ఆ రోజు గోపాలరావు నిద్రలేచేసరికి సతీష్ కనబడలేదు.

"పూర్ణా! సతీష్‌ని ఏమన్నా అన్నావా? వాడు ఇంట్లోంచి వెళ్ళిపోయినట్లున్నాడు" అన్నాడు గోపాలరావు ఆదుర్దాగా!

"లేదండీ, నేనేమీ అనలేదు. అయినా వాడు ఇంట్లోంచి వెళ్ళిపోతే అంత బాధపడడం దేనికి? ఏదో కన్నకొడుకు ఇంట్లోంచి వెళ్ళిపోయినట్లు బాధపడుతున్నారు" అంది చిరాగ్గా.

"ఏమిటో పూర్ణా! వాడు కన్నకొడుకు కాకపోయినా. ఈ పదేళ్ళలోనూ వాడితో ఏర్పడిన అనుబంధం అంతకన్నా ఎక్కువేనేమో అనిపిస్తుంది." అంటూ అన్ని గదులూ వెతుకుతూ సతీష్ పడుకున్న చోటు దగ్గరకి వెళ్ళేడు.

అక్కడ టేబుల్ మీద పేపర్ వెయిట్ క్రింద రెపరెపలాడుతున్న కాగితం అతడిని ఆకర్షించింది.

ఆత్రంగా కాగితాన్ని విప్పాడు.

"పూజ్యులైన గురువుగారికి నమస్కారములు.

మిమ్మల్ని వదలివెళ్ళడం నాకు చాలా బాధగా వుంది. నన్ను చేరదీసి, నాకు నాలుగు అక్షరం ముక్కలు నేర్పిన మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేనిది. ఇంకా మీకు భారంగా ఉండడం ఇష్టం లేదు. నా బ్రతుకు నేను బ్రతకాలనే ఈ ఇంటినుండి దూరంగా వెళ్ళిపోతున్నాను. మీతో చెప్పి వెళ్తే, నన్ను పంపడానికి మీరు ఒప్పుకోరేమోనన్న భయంతో, ఇంత సాహసానికి పూనుకున్నాను. మీ మనసుకి బాధ కలిగిస్తున్నందుకు క్షమించమని అడుగుతున్నాను.

ఇట్లు
సతీష్."

సతీష్ ఇంట్లోంచి వెళ్ళిపోయినందుకు, ఒక బాధ్యత తగ్గిందని సరిపెట్టుకుందామన్నా, ఎక్కడో అంతరాంతరాళల్లో, చదువురాని సతీష్ ఈ నాగరిక ప్రపంచంలో ఎలా బ్రతకగలడు? అన్న ప్రశ్న అతడిని వేధించసాగింది. కనీసం తను వాడికి సంగీత విద్య అన్నా పూర్తిగా చెప్పలేదు. తనని నమ్ముకొని, తనకి, తనవాళ్ళకి ఒళ్ళు దాచుకోకుండా చాకిరీచేస్తే, తను వాడికి నేర్పింది చాలా తక్కువే!

* * *

కాలచక్రంలో మరోపదేళ్ళు సునాయాసంగా గడిచిపోయాయి. ఈ పదేళ్ళ కాలంలోనూ గోపాలరావుని మరింత వార్ధక్యం ఆవరించింది. ఏకబిగిని నాలుగు గంటలసేపు కచేరీలు చేసే, అతడి కంఠం ఇపుడు ఒక్క గంట పాడేసరికే అలసిపోయినట్లు అయిపోతుంది. గుండెల్లో ఆయాసం, నరాల బలహీనత గోపాలరావుని పూర్తిగా కృంగదీసాయి. ఇక కచేరీలు చేసే ఓపిక లేక, హైద్రబాద్‌లో ఉద్యోగం చేస్తున్న కొడుకు మనోహర్ దగ్గరకి వెళ్ళిపోయాడు.

అన్నపూర్ణ రెండేళ్ళక్రితం చనిపోవడంతో, గోపాలరావుకి కొడుకువెంట వెళ్ళక తప్పించికాదు. తన కొడుక్కాగాని, కూతురికి గాని తన విద్య అబ్బనందున, అతడెంతో బాధపడేవాడు.

ఎప్పుడో తనకి ఒంట్లో బాగున్నప్పుడు తంబూరా శ్రుతిచేసుకొని, ఒక అరగంట పాడుకునేవాడు. ఎక్కడన్నా సంగీత సభలు జరిగితే, ఓపిక తెచ్చుకొని వెళ్ళేవాడు. ఒకప్పుడు మహావిద్వాంసుడిగా బ్రతికిన గోపాలరావు, ఇపుడు కేవలం ఒక శ్రోతగా మిగిలిపోయాడు.

ఆ రోజు రవీంద్రభారతిలో కచేరీ వుందని తెలిసి, అక్కడికి బయలుదేరాడు గోపాలరావు.

అతడు వెళ్ళేసరికే, కచేరీ మొదలు అవడంతో, అందరూ నిశ్శబ్దంగా ఆలకిస్తున్నారు

స్టేజిమీద కచేరీ చేస్తున్న ఆ యువకుడిని చూసి గోపాలరావు కళ్ళు ఆనందంతో చెమర్చాయి.

"బాబూ, సతీష్!" అని పిలుద్దామనిపించింది కానీ ఇంతమంది ఉన్న సభలో అలా పిలిస్తే బాగుండదని ఆ కోరికని బలవంతాన ఆపుకున్నాడు.

సతీష్ ఇంత ఉన్నత స్థితికి వచ్చాడంటే అతడి హృదయం ఆనందంతో పొంగిపోతుంది. తనకన్నా మించిపోయినట్లు, సతీష్ తన గానంతో, శ్రోతలని సమ్మోహితులను చేస్తుంటే, పరవశంగా వినసాగాడు.

మూడున్నర గంటలసేపు నిర్విరామంగా పాటకచేరీ ముగించాడు సతీష్.

ఆ తర్వాత మైకు అందుకొని, సతీష్‌ని అభినందించసాగారు మరొక సంగీత విద్వాంసుడు.

"మనల్ని ఇంతవరకూ సంగీత రస సాగరంలో ఓలలాడించిన సతీష్‌గారి గాత్రం వింటుంటే, ఈ కచేరీ మరొక మూడు గంటలు చేస్తే బాగుంటుందనిపిస్తుంది. ఆయన ఇంకా వృద్ధిలోకి రావాలని కోరుకుంటున్నాను" అని ముగించాడు.

పలువురు పెద్దలు సతీష్‌ని అభినందిస్తుంటే గోపాలరావు కళ్ళు ఆనందంతో చెమర్చాయి.

స్టేజీమీద కూర్చున్న సతీష్ ఒక్కసారి గొంతు సవరించుకొని, "నేను ఈనాడు మీ అందరి మన్ననలు అందుకుంటున్నానంటే, దానికి కారణం మా గోపాలరావు గురువుగారు. ఆయనకి నేను ఆజన్మాంతం ఋణపడి ఉంటాను. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అన్నారు పెద్దలు. కానీ నాకు తల్లీ, తండ్రీ, గురువు, దైవం అన్నీ ఆయనే! నాకు ఈ సంగీత విద్య నేర్పిన ఆది గురువు ఆయన. ఆయనకి సభాముఖంగా నా కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను" అని ముగించాడు.

కచేరీ ముగియడంతో ఎక్కడివాళ్ళు అక్కడికే వెళ్ళిపోయారు

గోపాలరావు స్టేజీ దిగుతున్న సతీష్‌ని "బాబూ! సతీష్!" అని పిలిచాడు

"మాస్టారూ! మీరు ... మీరేనా;" అన్నాడు సతీష్ సంభ్రమంగా.

"ఔను బాబూ! ఇన్నాళ్ళు ఎక్కడున్నావు? ఎలా బ్రతికావు?" ఆత్రంగా సతీష్ ఒళ్ళు నిమురుతూ అడిగాడు.

"నేను ప్రస్తుతం ఈ ఊళ్ళోనే ఉంటున్నాను. మీరు నేర్పిన విద్యతో సంగీత పాఠాలు చెప్పేవాడిని. చిన్నచిన్న కచేరీలు చేసేవాడిని. కొంతమంది విద్వాంసుల దగ్గరకు వెళ్ళి నాకు రానివి, అర్థం కానివి చెప్పించుకునే వాడిని. ఈ రోజు మిమ్మల్ని చూస్తున్నందుకు నాకు చాలా ఆనందంగా వుంది. నాకు ప్రస్తుతం ఈ కచేరీల వల్ల బాగానే ఆదాయం వస్తుంది" అన్నాడు సతీష్!



"సతీష్! నేను నీకు చాలా అన్యాయం చేసాను. ఆనాడే నేను నీకు బాగా సంగీతం నేర్పి ఉంటే, నువ్వు ఈపాటికి ఇంకా పెద్దవాడివైపోయుండేవాడివి. నీ మీద నిర్లక్ష్యంతో నీకా విద్య సరిగ్గా చెప్పలేదు. కానీ ఈ రోజు నువ్వే అదంతా నేనే చెప్పినట్లు, అందరికీ చెప్తుంటే నా తప్పేమిటో తెలుసుకున్నాను. కన్నబిడ్డలకు సంగీతం అబ్బలేకపోయినా, నువ్వన్నా నా పేరు నిలబెట్టావు. నాకింతే చాలు" అన్నాడు తృప్తిగా.

"ఇప్పటికే చాలా రాత్రి అయ్యింది. మిమ్మల్ని ఇంటిదగ్గర డ్రాప్ చేస్తాను. రండి" అని తన కారు దగ్గరికి నడిచాడు సతీష్!

సంగీతంలోనూ, అంతస్తులోనూ తనకన్నా అన్ని విధాల పెద్దవాడైపోయిన సతీష్‌ని మురిపెంగా చూస్తూ అతడిని అనుసరించాడు గోపాలరావు.

తృప్తి నిండిన మనసుతో కారులో కూర్చున్నాడు గోపాలరావు.

—*—